# మొహమాటం

## భూపాల్

నా మిత్రుడు రామారావు సిద్ధిపేట నుండి పెట్టే బేడా సర్దుకొని హైద్రాబాద్ వచ్చాడు ఈ మధ్యే. మంచి అడ్వకేట్‌గా పేరుంది అతనికి. పబ్లిక్ రిలేషన్స్ చాలా అవసరం కదూ! అందుకే నా పి.పి. నంబర్‌కి ఫోన్ చేసి నన్ను పిలిపించుకొని నా స్కూటర్ మీద అలా అలా తిరిగొద్దామని వాడే పనులు పురమాయించేస్తున్నాడు. మంచి నవల రాద్దామనీ, మీ కథ బాగుందనీ, మీరు చాలా గొప్ప కళాకారులనీ, మీ మనసు బంగారం కన్నా మెరుగనీ పొగడ్త. అంతేకాదు ఒకే ఒక్క సంవత్సరంలో మనం ఎలాగైనా ఒక్క కోటి సంపాదించాలి. దానికి నేను మంచి మార్గం యోచించాను. నా దూరపు బంధువు ఒకడు ఈ మధ్యే ఇక్కడికొచ్చి కోట్లు సంపాదించాడు. మనమూ సంపాదించి వాడి ముఖం మాడిపోయేలా చూపించాలి అన్నప్పుడు ఇవి అన్నీ కోతలని నాకప్పుడే అర్థమైంది. ఎప్పుడూ ఏదో పనిమీద అలా తిరిగొచ్చిన నాకు రేపటి ప్రోగ్రాం కూడా పురమాయించి ఫలనా చోట కలుద్దామనేవాడు.

సరే కొత్త మిత్రుడు గదా కష్టాల్లో ఉన్నాడు, భార్య లేదు, వదిలేసి పోయింది. పొట్ట చేత పట్టుకొని వచ్చాడని కొంతకాలం నా స్కూటర్, నా పెట్రోల్, నా టైం అన్నీ ఇచ్చి తిప్పాను. ఒక దశలో డబ్బు లేకున్నా ఆదుకున్నాను.

అయినా, ఎంతకాలం తిరుగుతా, విసుగొచ్చింది. మాటల సుత్తీ బాగా అర్థమైంది. కొంత జాప్యం చేసి పిలిచినప్పుడు వెళ్ళకూడదని ఏదో సాకు చెప్పేద్దామని నిర్ణయించుకున్నాను. ఉదయం మామూలుగానే ఫోన్ కాల్ వచ్చింది. సరే వెళ్ళి మాట్లాడాను. "మధ్యాహ్నం రండి పతంజలి గార్ని కలుద్దాం" అన్నాడు. నాకు వెళ్ళాలనిలేదు. ఏం చెప్పాలో వెంటనే తోచక "స్కూటర్ పాడైందండి" అన్నా. "మరి బాగు చేయించకపోయారా" అనంటే "డబ్బు... డబ్బు చేతిలో ఉండాలిగా?" అన్నాను.

"నేనిస్తున్నాను"అంటూ ఫోన్ పెట్టేశాడు.

అరగంటలో వచ్చేశాడు. రెండేసి రూపాయల నోట్ల కట్ట రెండు వందల రూపాయలు రాగానే చేతికిచ్చాడు. ఆ మాత్రం డబ్బు నా దగ్గరా వుంది. వద్దన్నాను. "బలేవారే మొహమాట పడితే ఎలా! మీ దగ్గరలేదని



నాకు తెలుసు. తీసుకోండి సార్. ఒకరి అవసరం ఒకరిది. మనమధ్య ఆ మొహమాటాలు పనికిరావు తీసుకోండి".

ఆ రోజే సాయం సమయం చిక్కడపల్లిలో హనుమంతరావు కలిశాడు. నేను స్కూటర్ ఆపగానే "అరే! అప్పుడే బాగు చేయించారే స్కూటర్" అన్నాడు. తనూ రామారావు బంధువులని తెలుసు. నవ్వి ఊరుకున్నాను. అటు నుండి బాగ్‌లింగంపల్లి కొచ్చేసరికి కూరగాయలు కొంటూ రామారావు అక్క కనిపించింది. ఆమె ముందుమాటగా "తమ్ముడూ! స్కూటర్ పాడైందటగా రామారావు చెప్పాడు. బాగైందా?" అంది. తలవూపి ఇదిగో అన్నాను నవ్వుతూనే.

ఇల్లుచేరి ఇంక ఆ విషయం పెద్దగా ఆలోచించక పడుకుండిపోయాను. తెల్లవారింది. ఫోన్... ఫోన్‌లో రామారావు తల్లిగారు "ఏమమ్మా?" అంటే "స్కూటర్ పాడైతే చాలా కష్టం బాబూ! నీలాగా బాగా తిరిగేవాడికి మరీ కష్టం. బాగు చేయించావా! రామారావు కోర్టు నుండి ఐదుగంటలకొస్తానాన్నడు. నువ్వు వస్తే కాస్సేపు వెయిట్ చేయమన్నాడు" అంది. ఆ విషయం ఫోన్ చేసి ఎందుకు చెప్పాలో నాకు అర్థం కాలేదు.

పది గంటల ప్రాంతంలో ఏదో పనిపడి పత్రికాఫీస్‌కెళ్ళాను. అక్కడ క్రిష్ణారావు కలిసి "ఏం! బాస్, స్కూటర్ పాడైందట బాగు చేయించావా! రామారావు డబ్బులిచ్చాడటగా!" అన్నాడు. ఇక నాకు ఓపిక నశించింది. వెంటనే ఇంటికి బయలుదేరి వస్తుంటే అక్కడ గేటు దగ్గిరే మరో మిత్రుడు "ఈ రామారావు సంగతేం అర్థం కాకుంది. విరాళంగా వందరూపాయలు నాల్గునెలల కిందటే రాశాడు. ఈ రోజు అడిగితే! మీకు స్కూటర్ పాడైందని రెండు వందలిచ్చాడట. మీరివ్వగానే ఇస్తానంటున్నాడు. అంతలేసి లాయర్‌కి వందా రెండు వందలు లెక్కా?" అన్నాడు.

నా ప్రాణాలు నిలువునా పోయి నీరయ్యాను. ఇంకా ఒక్క గంట ఆలస్యమైతే రేడియోలో, పేపర్లలో, టీ.వీలో కూడా వార్త వచ్చేస్తుందనే అనిపించింది.

---

# నాదమయినప్పుడు

ఓ నల్లనివాడు
పిల్లన గ్రోవి నూదగానే
పశు పక్షులు
వనాలు, మనుషులు
తేలియాడుతూ వెళ్ళాయి
'కిం కర్తవ్యం' అని కూర్చుంటే
వెలుగు మాటొక్కటి
యుద్ధభూమిలో గీతమై
వినికిడిలోకొచ్చి
సంధించిన ధనుస్సయింది
నీ, నా ల కతీతంగా
వీచే ప్రవాహమై.
ప్రతీ ఇంటిలో
ఊపిరిలా తిరుగాడింది
ఓ నాదం
గురు తరంగమై
జీవితాన్ని నిమిరింది
ఓ అడవితీగ
అడవి గుండెను
వెన్నంటి వెళుతున్నట్టు
మన నవనాడుల్లో
సంచరించింది
రాత మాటయ్యింది
కుచ్చుటోపీ తగిలించుకుని
అరవై నాలుగు కళలకూ
దస్తావేజులడిగింది
ముందొచ్చిన చెవులకంటే
వెనకొచ్చిన కొమ్ములు వాడే గానీ
వర్ణోత్పత్తి
నాదమయినపుడు
ప్రపంచాన్ని దేహంలోకి
వంపిందీ, వంపేది చెవులేగా!

\- సుజాత పట్వారి